సాక్షి
వికారాబాద్

మంగళవారం । 14 । నవంబర్ । 2023



రైతులకు న్యాయం చేస్తాం

బీఆర్‌ఎస్ పాలనలో నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని పరిగి కాంగ్రెస్ అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 10లో▸



దౌల్తాబాద్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

న్యూస్‌రీల్

నేడు వికారాబాద్‌కు అసదుద్దీన్ ఓవైసీ



మాట్లాడుతున్న ఎంఐఎం నాయకులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని చిగుళ్లపల్లి గ్రౌండ్‌లో మంగళవారం జరిగే జల్సా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ హాజరుకానున్నట్లు ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఉస్మాన్ తెలిపారు. సోమవారం చిగుళ్లపల్లి మైదానాన్ని వారు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాయంత్రం 6గంటలకు జరిగే జల్సా కార్యక్రమానికి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి ముస్లింలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి ఎండీ కలీమొద్దీన్, జాయింట్ సెక్రటరీలు ఎండీ అలీం, ఎండీ అలీ, మిర్జా ఫెరోజ్ బేగ్, షరీఫ్, బిలాల్, నాసర్, బురాన్, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

చిరుత సంచారంపై హెచ్చరిక బోర్డు



అనంతగిరి గుట్ట మార్గంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

అనంతగిరి: వికారాబాద్ అటవీ ప్రాంతంలో చిరుతపులి సంచరిస్తున్న నేపథ్యంలో ఫారెస్ట్ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. అటవీ ప్రాంత సమీపంలోని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అడవిలోకి వెళ్లరాదని అధికారులు సూచించారు. ఈ మేరకు వికారాబాద్ – అనంతగిరి ప్రధాన రహదారిపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు కుల్కచర్ల విద్యార్థి



ట్రోఫీతో చరణ్‌కుమార్

కుల్కచర్ల: జాతీయ స్థాయి అండర్– 19 వాలీ బాల్ పోటీలకు కుల్కచర్ల మండలం మోడల్ స్కూల్ విద్యార్థి చరణ్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 11,12వ తేదీల్లో సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో చరణ్ అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. డిసెంబర్ మాసంలో గుజరాత్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని మోడల్ స్కూల్ పీఈటీ కృష్ణారెడ్డి తెలిపారు. జాతీయస్థాయి పోటీలకు చరణ్ ఎంపిక కావడం సంతోషంగా ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి అన్నారు.

తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలి



కొత్లాపూర్ చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న డీటీసీ అడిషనల్ ఎస్పీ మురళీధర్

తాండూరు రూరల్: కర్ణాటక – తెలంగాణ సరిహద్దులో పకడ్బందీగా తనిఖీలు నిర్వహించాలని డీటీసీ అడిషనల్ ఎస్పీ మురళీధర్ ఆదేశించారు. సోమవారం మండలంలోని కొత్లాపూర్ చెక్‌పోస్ట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో తనిఖీలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. నగదు, మద్యం, మత్తు పదార్థాలు తరలిస్తే కేసులు నమోదు చేయాలన్నారు.

కట్టుదిట్టంగా వాహనాల సోదాలు

అనంతగిరి: జిల్లాలో కట్టుదిట్టంగా వాహనాలను తనిఖీ చేస్తున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రూ. 2,54,24,951 సీజ్ చేసినట్లు తెలిపారు. రూ. 17,44,697 విలువ చేసే 3,456 లీటర్ల మద్యం, రూ. 3,45,000 విలువ చేసే 14 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సరైనా ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 22,90,000 నగదు, 45 తులాల బంగారు ఆభరణాలు, 42 సెల్ ఫోన్లు, రూ. 9,61,000 విలువ చేసే సామగ్రిని సీజ్ చేసినట్లు తెలిపారు.

ఏడాదిలోగా 'పాలమూరు'ను
పూర్తి చేస్తాం

- కాంగ్రెస్ నాయకుల అడ్డంకులతోనే ఆలస్యం
- పరిగిలో రెండో సారి విజయం ఖాయం
- తెలంగాణ ఉద్యమంలో హరీశ్వర్‌రెడ్డి కృషి ఎనలేనిది
- కుల్కచర్ల రోడ్ షోలో మంత్రి కేటీఆర్



కుల్కచర్ల రోడ్ షోలో మాట్లాడుతున్న కేటీఆర్ చిత్రంలో మహేశ్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి

పరిగి/కుల్కచర్ల: కాంగ్రెస్ నాయకులు అడ్డంకులు సృష్టించడం వల్లే పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఆలస్యమైందని, లేకుంటే ఇప్పటికే ప్రతి గ్రామానికీ సాగునీరు అందేదని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. సోమవారం కుల్కచర్ల మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్ షో పాల్గొని ప్రసంగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పదేళ్లపాటు అధికారంలో ఉండి కూడా చేవెళ్ల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయలేని కాంగ్రెస్ నాయకులు పాలమూరు ఎత్తిపోతల పథకం గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ నాయకులు వేసిన కేసుల కారణంగానే ఆలస్యం జరిగిందని మండిపడ్డారు. ప్రస్తుత ఎన్నికల్లో అధికారం చేపట్టిన ఏడాది లోగా పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. తెలంగాణ రాక ముందు మన ప్రాంతంలో వరి దిగుబడి ఎలా ఉండేదో, నేడు ఎలా ఉందో ప్రజలు గుర్తించాలన్నారు. దేశంలోనే వరి పండించడంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే రేషన్ కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి సన్న బియ్యం అందిస్తామన్నారు. ఏ ఊరికి పోయినా హనుమంతుని గుడి ఎలా ఉంటుందో రాష్ట్రంలో ఏ ఇంటికి పోయినా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు ఉంటాయన్నారు. పరిగి నియోజకవర్గంలో ఎక్కువ తండాలు ఉన్నాయని, వాటిని గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. గిరిజనులకు 6శాతం ఉన్న రిజర్వేషన్‌ను 10శాతానికి పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రతి తండాలో సేవాలాల్ భవనాలను నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

హరీశ్వర్‌రెడ్డి సేవలు మరువలేనివి

తెలంగాణ ఉద్యమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్ స్వర్గీయ హరీశ్వర్‌రెడ్డి చురుగ్గా పాల్గొన్నారని మంత్రి కేటీఆర్ అన్నారు. తన పదవిని వదిలి కేసీఆర్ వెంట నడిచిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన మనలో లేక పోవడం చాలా బాధాకరమని, నియోజకవర్గ ప్రజలకు ఆయన చేసిన సేవలను ఎన్నటికీ మరువలేమన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం

కుల్కచర్ల/దోమ: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు సోమవారం కులకచర్ల గిరిజన గురుకుల పాఠశాలలో మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో హెలిక్యాప్టర్‌లో ల్యాండ్ అయ్యారు. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కొప్పుల అనిల్ రెడ్డి, నాగేందర్‌గౌడ్, ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కాసాని వీరేశ్ కేటీఆర్‌కు బొకే అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కుల్కచర్ల మండల కేంద్రంలో నిర్వహించే బహిరంగ సభకు కేటీఆర్ బయలుదేరి వెళ్లారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

సీఎం కేసీఆర్ పాలనలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. రూ.రెండు వందలు ఉన్న పింఛన్‌ను రూ. 2 వేలకు చేశారని గుర్తు చేశారు. సంక్షేమ పథకాల అమలులో ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి ఇంటికీ అందేలా కృషి చేశారన్నారు. రైతు బంధు, దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు పథకాలను ప్రవేశపెట్టి అన్ని వర్గాలకు న్యాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. పరిగిలో డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాల, కుల్కచర్లలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రి కేటీఆర్‌ను కోరారు. అలాగే గండీడ్, మహ్మదాబాద్ మండలాలను వికారాబాద్ జిల్లాలో కలపాలని కోరారు. పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా పరిగి నియోజకవర్గానికి త్వరితగతిన నీరు అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కేటీఆర్ గండీడ్, మహ్మదాబాద్ మండలాలను వికారాబాద్ జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. పరిగి, కుల్కచర్ల మండల కేంద్రాల్లో కళాశాలలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

తెలంగాణ బాగుపడాలంటే
ఇందిరమ్మ రాజ్యం రావాలి

- పదేళ్లు సీఎంగా ఉన్న కేసీఆర్ కొడంగల్‌ను పడావ్ చేశారు
- పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి
- దౌల్తాబాద్‌లో కార్నర్ మీటింగ్

దౌల్తాబాద్: తెలంగాణ బాగుపడాలంటే ఇందిరమ్మ రాజ్యం రావాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని పీసీసీ అధ్యక్షుడు, కొడంగల్ ఎమ్మెల్యే అభ్యర్థి రేవంత్‌రెడ్డి అన్నారు. సోమవారం దౌల్తాబాద్‌లోని గాంధీ కూడలి వద్ద కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్ల సీఎంగా ఉన్న కేసీఆర్ కొడంగల్ ప్రాంతాన్ని అభివృద్ధి చేయకుండా పడావ్ పెట్టారని విమర్శించారు. ఇక్కడ కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధే కనిపిస్తోందని అన్నారు. కొడంగల్‌కు కృష్ణా జలాలు తెస్తామని, డబుల్ ఇళ్లు నిర్మిస్తామని, ఇంటికో ఉద్యోగం ఇస్తామని, సిమెంట్ ఫ్యాక్టరీలు నెలకొల్పుతామని, రైల్వే లైన్ తెస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. అమ్మకు అన్నం పెట్టనోడు.. చిన్నమ్మకు బంగారు గాజులు పెడతానంటే నమ్ముతామా అని కేసీఆర్‌ను ఉద్దేశించి ఎద్దేవా చేశారు. మన మంచితనంతో ఓట్లు వేయించుకొని కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారని, కొడుకు, అల్లుడిని మంత్రులను చేసుకున్నారని విమర్శించారు. రోడ్లు, బ్రిడ్జిలు కట్టింది కాంగ్రెస్ కాదా అని అన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో ఇసుక దందాలు పెరిగిపోయాయని ఆరోపించారు. అమాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసులకు మా కార్యకర్తలు భయపడరని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే కల్యాణలక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డ పెళ్లికి రూ.లక్ష తోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారు. నిత్యావసర ధరలను అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే రూ. 500కే సిలిండర్, గృహలక్ష్మి పథకం కింద ప్రతి నెలా మహిళకు రూ.2500, రైతు భరోసా కింద ఎకరాకు ఏడాదికి రూ.15వేలు, కౌలు రైతులకు ఏడాదికి రూ.15వేలు, భూమిలేని వారికి ఏడాదికి రూ.12 వేలు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇంటి నిర్మాణానికి రూ. 5లక్షలు, ప్రతి ఇంటికీ 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్, ప్రతి నెలా రూ.4వేలు పింఛను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకాలన్నీ అమలు కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేసి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాజీ ఎ మ్మెల్యే గురునాథ్‌రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి క ల్వ సుజాత, నాయకులు వెంకట్రావు, వెంకట్‌రెడ్డి, వీరన్న, వెంకట్రాములు, రెడ్డి శ్రీనివాస్, నర్సింగ్ భాన్‌సింగ్, సత్యపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎందుకు తిట్టారో చెప్పండి

రేవంత్‌రెడ్డి ప్రచారానికి రాక ముందు కాంగ్రెస్ స్థానిక నాయకులు సత్యపాల్, నర్సింలు బీఆర్‌ఎస్ వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డిని పరుషపదజాలంతో దూషించారు. దీంతో వైస్ ఎంపీపీ భార్య నిర్మల రేవంత్‌రెడ్డి ప్రసంగానికి సిద్ధమవుతున్న తరుణంలో స్టేజి మీదకు ఎక్కి నా భర్తను ఇక్కడి నాయకులు ఎందుకు తిట్టారో చెప్పాలని నిలదీశారు. దీంతో రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి సదరు మహిళను సముదాయించి అక్కడి నుంచి పంపించారు. తర్వాత మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డిని కార్యకర్తలు తిట్టడం సరికాదని, అందుకు తాను క్షమాపణ చెబుతున్నట్లు ప్రకటించారు.



ధారూరు మార్కెట్‌లో పచ్చిమిర్చి తూకం వేస్తున్న రఘువీరారెడ్డి

'కారు' పని అయిపోయింది

- వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే
- ఆరు గ్యారంటీలతో అన్ని వర్గాల ప్రజలకు మేలు
- పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి
- ఎబ్బనూరులో హన్మంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

ధారూరు: తెలంగాణలో బీఆర్‌ఎస్ పార్టీ పని అయిపోయిందని, వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి అన్నారు. మీ అమూల్యమైన ఓటును హస్తం గుర్తుకు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని మైనార్టీలను కోరారు. ఆదివారం పీసీసీ కార్యదర్శి సందీప్‌రాజ్, పార్టీ శ్రేణులతో కలిసి ధారూరు పంచాయతీ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు రోడ్ షో నిర్వహించారు. బీఆర్‌ఎస్ పాలనలో అవినీతి, దోపిడీ పెరిగిపోయిందని ఆరోపించారు. అభివృద్ధిని విస్మరించారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలను ప్రజలు స్వాగతిస్తున్నారని, అధికారంలోకి రాగానే అమలు చేస్తామని పేర్కొన్నారు. ప్రతి మహిళకు నెలకు రూ. 2,500, ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని హామీ ఇచ్చారు.

ఎబ్బనూరులో ప్రచారం

మండలంలోని ఎబ్బనూర్ గ్రామంలో వాలీబాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డితో కలిసి సోమవారం ఇంటింటి ప్రచారం చేశారు. ఎమ్మెల్యే ఆనంద్ ఐదేళ్లు అధికారంలో ఉన్నా నియోజకవర్గ అభివృద్ధికి చేసిందేమీ లేదని ఆరోపించారు. రోడ్లు దెబ్బతిన్నా పట్టించుకోలేదని మండిపడ్డారు. కనీస మరమ్మతులు కూడా చేయించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు విజయభాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రాములు, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు బసప్ప, నాయకులు రాంరెడ్డి, ఆశం, ముజఫర్, మల్లారెడ్డి, ఇబ్రహీం, దావుద్ తదితరులు పాల్గొన్నారు.

22 నామినేషన్ల తిరస్కరణ

అనంతగిరి/తాండూరు/పరిగి/కొడంగల్: జిల్లాలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 22 మంది అభ్యర్థుల నామినేషన్ల తిరస్కరణకు గురయ్యాయి. సోమవారం ఆయా కేంద్రాల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను పరిశీలించారు. వికారాబాద్‌లో 7 నామినేషన్లు, కొడంగల్‌లో ఒకటి, తాండూరులో 3, పరిగిలో 11 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వికారాబాద్‌లో 19 మంది నామినేషన్లు వేయగా 7 తిరస్కరణకు గురి కాగా 12మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఎర్రోళ్ల లక్ష్మయ్య, డాక్టర్ సబితా ఆనంద్ ఫారం– ఏ, బీ సమర్పించక పోవడంతో తిరస్కరించారు. వీరితో పాటు అరిగే మైపాల్, అరిగే సురేష్, అలాగే డబ్బాని దిలీప్, మహేష్‌కుమార్, అరుణ రాణి సరైన పత్రాలు, సంతకాలు చేయకపోవడంతో తిరస్కరించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ తెలిపారు.

పరిగిలో..

పరిగి అసెంబ్లీ స్థానానికి 26 మంది అభ్యర్థులు 48 సెట్ల నామినేషన్లు వేయగా 11 నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు ఆర్‌ఓ విజయకుమారి తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి, డీసీసీ అధ్యక్షుడు టీ రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమాదేవి ఏ, బీ ఫారాలు సమర్పించక పోవడంతో తిరస్కరించారు. అలాగే తెలంగాణ రాజ్యసమితి అభ్యర్థి లాలయ్య ఫారం 26 సమర్పించక పోవడంతో ఆయన రెండు సెట్ల నామినేషన్లను తిరస్కరించారు.



వికారాబాద్‌లో నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాహుల్ శర్మ

కొడంగల్‌లో..

కొడంగల్ అసెంబ్లీ స్థానానికి 16 మంది నామినేషన్లు వేయగా ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థి శ్రీనివాస్ ఏ, బీ ఫాంలు సమర్పించకపోవడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి లింగ్యానాయక్ తెలిపారు.

తాండూరులో..

తాండూరు అసెంబ్లీ స్థానానికి 28మంది అభ్యర్థులు 37 సెట్ల నామినేషన్లు వేయగా 3 తిరస్కరణకు గురయ్యాయి. బీజేపీ అభ్యర్థి రమేష్‌కుమార్, బీఆర్‌ఎస్ అభ్యర్థి ప్రమోదినిదేవి పార్టీ బీ ఫామ్ సమర్పించక పోవడంతో తిరస్కరించారు. డెమొక్రటిక్ రీఫామ్ పార్టీకి చెందిన అజయ్‌రెడ్డి వయస్సు 22 ఏళ్లు ఉండటంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు.

అనుమతిలేకుండా అర్ధరాత్రి లిక్కర్ పార్టీ

- బిగ్‌బాస్ ఫేమ్ హిమజపై కేసు నమోదు



ఇబ్రహీంపట్నం: ఎలాంటి అనుమతి లేకుండా అర్ధరాత్రి లిక్కర్ పార్టీ నిర్వహిస్తున్న బిగ్‌బాస్ ఫేమ్ హిమజపై ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. స్థానిక ఎస్‌ఐ మారయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీపట్నం సమీపంలోని జేబీ ఇన్‌ఫ్రా వెంచర్‌లో బిగ్‌బాస్ ఫేమ్ హిమజకు విల్లా ఉంది. తన పుట్టిన రోజును పురస్కరించుకొని ఆమె స్నేహితులను శనివారం ఇంటికి ఆహ్వానించింది. ఎన్నికల వేళ, అర్ధరాత్రి సమయంలో సౌండ్ సిస్టం మోగుతుండటంతో అక్కడ ఏదో రేవ్ పార్టీ జరుగుతుందనే అనుమానంతో గుర్తు తెలియని వ్యక్తులు డయల్ 100కు కాల్ చేశారు. సమాచారం అందుకున్న మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు రంగప్రవేశం చేసి హిమజ ఇంటిపై దాడి చేశారు. ఈ సందర్భంగా అక్కడ సుమారు రూ.9 వేలకు పైగా విలువ చేసే 14.9 లీటర్ల మద్యం, సౌండ్ సిస్టం స్వాధీనం చేసుకున్నారు. రేవ్ పార్టీలాంటిదేమీ జరగలేదని, ఎక్కువ మొత్తం లిక్కర్ లభించడం, ఎన్నికల నియమావళి ఉల్లంఘన, ఎలాంటి అనుమతిలేకుండా సౌండ్ సిస్టం ఏర్పాటుపై ఎక్సైజ్, సీపీ, ఐపీసీ సెక్షన్ల కింద హిమజపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు. ఆమె స్నేహితులు సుమారు 14 మందికిపైగా ఈ వేడుకల్లో పాల్గొన్నట్లు సమాచారం.

అంతా రెడీ

- నేడు 'పట్నం'లో ప్రజా ఆశీర్వాద సభ
- హాజరుకానున్న సీఎం కేసీఆర్
- ఏర్పాట్లు పూర్తి చేసిన బీఆర్‌ఎస్ నేతలు
- భారీగా జనసమీకరణకు కసరత్తు



ఇబ్రహీంపట్నంలో సీఎం కేసీఆర్ బహిరంగసభకు ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం: బీఆర్‌ఎస్ ప్రజా ఆశీర్వాద సభకు ఇబ్రహీంపట్నం సిద్ధమైంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మంగళవారం హాజరుకానున్న సభకు గులాబీ నేతలు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సభ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో ఖానాపూర్ గేట్ సమీపంలో సభాస్థలిని ఏర్పాటు చేశారు. గతంలో కేసీఆర్ ఇక్కడికి వచ్చినప్పుడు ఇదే స్థలంలో సభ నిర్వహించారు. సీఎం హాజరుకానున్న నేపథ్యంలో పోలీసులు సభాస్థలిని తమ అధీనంలోకి తీసుకున్నారు. రాచకొండ పరిధిలోని పోలీస్ ఉన్నతాధికారులు బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. నామినేషన్ల సందర్భంగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్ వర్గీయులు పరస్పరం దాడులకు పాల్పడడం.. పలువురు గాయపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. హెలికాప్టర్‌లో సీఎం కేసీఆర్ వస్తుండటంతో సెయింట్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద హెలిపాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. సభాస్థలికి ఈ ప్రాంతం అతి సమీపంలో ఉంటుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను సంబంధిత అధికారులు చేపడుతున్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి

సభను విజయవంతం చేయండి

ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొనే బహిరంగసభకు నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోరారు. బహిరంగ సభ ఏర్పాట్లను సోమవారం పార్టీ రాష్ట్ర నాయకుడు క్యామ మల్లేష్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. సుమారు 70 వేల మంది ఈ సభకు హాజరయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో సహకరించారన్నారు. రహదారుల రూపురేఖలు మారిపోయాయని, పలు కంపెనీలు ఈ ప్రాంతానికి తరలివస్తున్నాయని..నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు రానున్నట్లు తెలిపారు. ఇంత వరకు చేసిన, చేయబోయే అభివృద్ధి పనులను ముఖ్యమంత్రి కేసీఆర్ తన ప్రసంగం ద్వారా ప్రజలకు తెలియజేస్తారని అన్నారు.

క్లుప్తంగా

రంగారెడ్డి జిల్లాలో స్క్రూటినీ పూర్తి



స్క్రూటినీ ప్రక్రియను పరిశీలిస్తున్న శిల్పాశర్మ

సాక్షి,రంగారెడ్డిజిల్లా: నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సోమవారం కొనసాగింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల నుంచి 280 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. రిటర్నింగ్‌ అధికారులు వీరి నామినేషన్లను పరిశీలించారు. వివరాలు సరిగా లేని 33 నామినేషన్లను తిరస్కరించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 58 నామినేషన్లు దాఖలు కాగా, వీటిలో నాలుగు తిరస్కరించారు. మహేశ్వరంలో 45 మంది అభ్యర్థులు 54 నామినేషన్లు దాఖలు చేయగా, వీరిలో ఇద్దరు అభ్యర్థులకు సంబంధించిన మూడు నామినేషన్లు తిరస్కరించారు. షాద్‌నగర్‌లో 24 మంది అభ్యర్థులు 48 నామినేషన్లు దాఖలు చేయగా, ముగ్గురు అభ్యర్థులకు సంబంధించిన మూడు నామినేషన్లు తిరస్కరించారు. చేవెళ్లలో 19 నామినేషన్లు దాఖలు కాగా, వీటిలో నాలుగు తిరస్కరణకు గురయ్యాయి. కల్వకుర్తి నియోజకవర్గంలో 28 నామినేషన్లకు, ఒక నామినేషన్‌ను తిరస్కరించారు. ఎల్బీనగర్‌ నియోజకవర్గంలో 62 నామినే షన్లు దాఖలు కాగా, వీటిలో ఐదుగురి నామినేషన్లు తిరస్కరించారు. శేరిలింగంపల్లిలో 41 మంది అభ్యర్థులు 66 సెట్ల నామినేషన్‌ పత్రాలు దాఖలు చేయగా, వీరిలో ఐదుగురికి సంబంధించిన ఆరు సెట్ల నామినేషన్‌ పత్రాలను తిరస్కరించారు. రాజేంద్రనగర్‌ నియోజకవర్గంలో 33 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, వీరిలో ఏడుగురి నామినేషన్లు తిరస్కరించారు.

షాద్‌నగర్‌లో ఉత్కంఠ

షాద్‌నగర్‌రూరల్‌: ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి నామినేషన్‌పై షాద్‌నగర్‌లో సోమవారం ఉత్కంఠ నెలకొంది. నామినేషన్‌ దాఖలులో ఫారం- ఏకు సంబంధించి సరైన సమాచారం అందలేదని ఎన్నికల అధికారులు కొద్దిసేపు విష్ణువర్ధన్‌రెడ్డి నామినేషన్‌ నిలిపివేశారు. పార్టీ సింహం గుర్తుకు సంబంధించిన సరైన పత్రాలు సమర్పించలేదని తెలిపారు. దీంతో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. స్పందించిన విష్ణువర్ధన్‌రెడ్డి నామినేషన్‌ పరిశీలన కేంద్రానికి వచ్చారు. గుర్తుకు సంబంధించిన పత్రాల సమాచారాన్ని మెయిల్‌ ద్వారా అందజేసినట్లు తెలిపారు. మెయిల్‌కు సంబంధించిన పత్రాలను అధికారులకు చూపించారు. దీంతో ఉత్కంఠకు తెరపడింది. మరోవైపు బీజేపీ అభ్యర్థి అందె బాబయ్యపై స్వతంత్ర అభ్యర్థి మఠం శశిధర్‌ ఫిర్యాదు చేశారు. బాబ య్య ఏబీ కాంప్లెక్స్‌ నిర్మాణ వ్యవహారంలో అక్రమా లకు పాల్పడ్డారని ఆరోపిస్తూ అధికారుల దృష్టికి తెచ్చారు.యువతులసి పార్టీకి చెందిన అభ్యర్థి పులి జాల నవీన్‌ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వీర్లపల్లి శంకర్‌పై ఫిర్యాదు చేశారు. శంకర్‌ తన ఎన్నికల అఫిడవిట్‌లో కొన్ని కేసులకు సంబంధించిన వివరాలు, కొన్ని ఆస్తుల వివరాలు వెల్లడించలేదంటూ ఎన్నికల అధి కారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చని, కోర్టుకు వెళ్లొ చ్చని ఫిర్యాదుదారులకు అధికారులు సూచించారు.

పోలింగ్‌ బూత్‌ల పరిశీలన



పోలింగ్‌ బూత్‌ను పరిశీలిస్తున్న శిల్పాగుప్తా

అత్తాపూర్‌: రాజేంద్రనగర్‌ ఎన్నికల పరిశీలన అధికారిణిగా శిల్పా గుప్తాను ఎన్నికల కమిషన్‌ నియమించింది. ఈ మేరకు ఆమె సోమవారం రాజేంద్రనగర్‌, బుద్వేల్‌లోని బూత్‌లను పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల పోటీచేసే అభ్యర్థులు పార్టీల ప్రజాప్రతినిధులు రాజేంద్రనగర్‌ ఆర్డీఓ కార్యాలయంలో మంగళ, గురు, శనివారాల్లో కలిసి తమ సమస్యలను వివరించాలన్నారు. ఆయా వారాల్లో జోనల్‌ కమిషనర్‌ కార్యాలయంలో సమావేశాలు నిర్వహిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

యాదయ్యది కుటుంబపాలన

బీజేపీ అభ్యర్థి కేఎస్‌ రత్నం

మొయినాబాద్‌: చేవెళ్ల నియోజకవర్గంలో ఎమ్మెల్యే యాదయ్య కుటుంబ పాలన సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ అభ్యర్థి కేఎస్‌ రత్నం ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మొయినాబాద్‌ మండల పరిధిలోని పెద్దమంగళారం, మేడిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఓటర్లను కలిసి బీజేపీ కమలం పువ్వు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే యాదయ్య ఇంట్లో నలుగురు పదవులు అనుభవిస్తున్నారన్నారు. పైరవీలు, అక్రమాలకు పాల్పడుతూ అడ్డగోలు వసూళ్లకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.కమలం పువ్వు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. సోమవారం మండల పరిధిలోని మోత్కుపల్లి, రెడ్డిపల్లి, మొయినాబాద్‌ తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్‌, కౌన్సిల్‌ మెంబర్‌ నస్‌పెల్లి ప్రభాకర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, పద్మనాభం, నర్సింహ్మారెడ్డి, మాజీ సర్పంచ్‌ రత్నం పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు న్యాయం

- అధికారంలోకి రాగానే ఏకకాలంలో రుణ మాఫీ
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: బీఆర్‌ఎస్‌ పాలనలో నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని కాంగ్రెస్‌ డీసీసీ అధ్యక్షుడు, కాంగ్రెస్‌ పరిగి అభ్యర్థి టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని తిమ్మాపూర్‌, కొత్తపల్లి, చీలాపూర్‌, మన్నేగుడ, పూడూరు, గొంగుపల్లి, మేడికొండ తదితర గ్రామాల్లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ పార్టీకి ఓటేసి గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామన్నారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామన్నారు. వైఎస్‌ఆర్‌ పాలనలో అర్హులందరికి ఇందిరమ్మ ఇల్లు, పింఛన్‌లు, ఆరోగ్య శ్రీ ద్వారా కార్పొరేట్‌ వైద్యం అందించారని గుర్తుచేశారు. ప్రచారంలో భాగంగా వివిధ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్‌, బీజేపీ, టీడీపీ నాయకులు హస్తం గూటికి చేరారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ సతీశ్‌రెడ్డి, మాజీ చైర్మన్‌ నర్సింహారెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు ఆనందం, డీసీసీ కార్యదర్శులు శ్రీనివాస్‌, పెంటయ్య, అజీం పటేల్‌, నాయకులు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్‌, సల్మాతాజొద్దీన్‌, మహిళా అధ్యక్షురాలు బాలమణి, కలీల్‌, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పూడూరు: టీఆర్‌ఆర్‌ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నాయకులు

ప్రజావ్యతిరేక పాలనను అంతమొందించాలి

దోమ: రాష్ట్రంలో కొనసాగుతున్న ప్రజావ్యతిరేకపాలనను ప్రజలు అంతమొందించాలని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి సతీమణి ఉమారెడ్డి అన్నారు. సోమవారం ఆమె మండల పరిధిలోని మల్లేపల్లితండాలో కాంగ్రెస్‌ పార్టీ కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ పథకాల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. పథకాలన్నీ వారి పార్టీ నేతలకే అందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలు అమలు చేసి అర్హులందరికీ అందజేస్తామన్నారు. కాంగ్రెస్‌ అభ్యర్థి టీఆర్‌ఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



దోమ: మల్లెపల్లి తండాలో ప్రచారం చేస్తున్న టీఆర్‌ఆర్‌ సతీమణి ఉమారెడ్డి

మోసపోతే గోసపడుతాం

కుల్కచర్ల: ప్రజలు బీఆర్‌ఎస్‌ మాటలు నమ్మి మోసపోతే.. ఐదేళ్లు గోసపడుతామని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్‌ పరిగి అభ్యర్థి తనయుడు రితీక్‌రెడ్డి అన్నారు. సోమవారం వారు మండల పరిధిలోని పుట్టపహాడ్‌లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు ఓటుతో బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్‌ టు అధ్యక్షుడు కర్రె భరత్‌ కుమార్‌, మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌ నాయక్‌, ఉపాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు స్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది ఇందిరమ్మ రాజ్యమే





ర్యాలీలో పాల్గొన్న ప్రజలు, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న ప్రసాద్‌కుమార్‌

- కాంగ్రెస్‌ వికారాబాద్‌ అభ్యర్థి ప్రసాద్‌కుమార్‌

అనంతగిరి: రాబోయేది ఇందిరమ్మ రాజ్యమేనని వికారాబాద్‌ కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి జి.ప్రసాద్‌కుమార్‌ ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం వికారాబాద్‌ మండలంలోని మైలార్‌దేవరాంపల్లి, పీలారం, రాళ్ల చిట్టంపల్లి గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. సీఎం కేసీఆర్‌ మాటిచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. దళితులకు 3 ఎకరాల భూమి, నిరుద్యోగులకు భృతి ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ అనుకూల పవనాలు వీస్తున్నాయని, తప్పకుండా ఈ ఎన్నికల్లో అత్యధిక ఎమ్మెల్యే స్థానాలు గెలుస్తామన్నారు. బీఆర్‌ఎస్‌ నేతల మాయమాటలు నమ్మవద్దన్నారు. తెలంగాణలో నిరుద్యోగులు అనేక అవస్థలు పడుతున్నారన్నారు. ఈసారి ప్రజలు తప్పకుండా మార్పు కోరుకుంటున్నారన్నారు. నాయకులు, కార్యకర్తలు గ్యారంటీ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మహిపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మల్లేశం, అనంత్‌రెడ్డి, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా

ఏఐఎఫ్‌బీ అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డి

కేశంపేట: ప్రజాసేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చానని తనను గెలిపిస్తే సంపాదించుకున్న ఆస్తిలో సగం నిరుపేదలకు రాసిస్తానని ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఆది, సోమవారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, తూర్పుగడ్డతండా, ఇప్పలపల్లి, దేవునిగుడితండా, పోమాల్‌పల్లి, కొండారెడ్డిపల్లి, పుట్టోనిగూడ, దత్తాయపల్లి, గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి ఎన్నికల నోటిఫికేషన్‌ కంటే ముందే చాలా అభివృద్ధి కార్యక్రమాలను సొంత నిధులతో చేపట్టానన్నారు. 2వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించానని గుర్తు చేశారు. నియోజకవర్గంలో 5వేల మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ను అందిస్తానని చెప్పారు. సంవత్సరానికి ప్రతి మహిళకు ఒక్క సిలిండర్‌ను ఉచితంగా అందిస్తానని వివరించారు. సింహం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయా కార్యక్రమాల్లో పసుల నర్సింహయాదవ్‌, నరేందర్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, పర్వతాలు, విఘ్నేష్‌, ఆనంద్‌ పాల్గొన్నారు.

విజయానికి వారే ప్రధానం

- ఎన్నికల్లో ద్వితీయ శ్రేణి నాయకుల పాత్రే కీలకం
- గ్రామాల్లో పట్టుకు నేతల వ్యూహ రచన
- గెలుపే లక్ష్యంగా పావులు



షాద్‌నగర్‌: ఎన్నికలంటే ఎత్తులు వేయాలి.. బరిలో గెలవాలంటే గురి ఉండాలి.. గురి ఉండాలంటే వ్యూహం తప్పొద్దు.. వ్యూహం ఉంటేనే ఓటర్లను ఆకర్షిస్తారు.. వారి వద్ద నుంచి ఓట్లు రాబట్టగలుగుతారు.. ఎన్నికల్లో సునాయాసంగా విజయం సాధిస్తారు. ఎన్నికల బరిలో ఉండే అభ్యర్థులు ప్రతీ గల్లీకి వెళ్లి చక్రం తిప్పలేరు.. ఇందుకు ద్వితీయ శ్రేణి నేతలే ప్రధానాధారం. ఎన్నికల వ్యూహాల్లో ద్వితీయ శ్రేణి నేతలు అద్వితీయమైన వ్యూహాలు రచిస్తున్నారు.

ప్రధాన అనుచరులే ప్రచారస్త్రాలు

నియోజకవర్గ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు ప్రతీ పార్టీలో పదుల సంఖ్యలో ముఖ్య నాయకులుంటారు. వీరే పార్టీ అభ్యర్థులకు ప్రధాన అనుచరులుగా మెలుగుతారు. గ్రామస్థాయిలో ఉండే పార్టీ నాయకులను, కార్యకర్తలను ఏకం చేయాలన్నా, ప్రజలను తమ వైపు తిప్పుకోవడంలో ద్వితీయ శ్రేణి నాయకులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఎన్నికల సమయంలో ద్వితీయ శ్రేణి నాయకుల పాత్ర అన్ని పార్టీల్లో కీలకం. ఎన్నికల ప్రచార వ్యూహాన్ని రచించడం.. గ్రామాల్లో ప్రత్యర్థి పార్టీల నాయకుల ఎత్తులకు పై ఎత్తులు వేస్తున్నారు. బరిలో ఉండే తమ పార్టీ అభ్యర్థులకు ఎప్పటికప్పుడు ప్రత్యర్థి పార్టీ నాయకుల సమాచారాలను చేరవేస్తూ అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ పార్టీ బలోపేతానికి కార్యాచరణ రూపొందిస్తున్నారు.

ప్రత్యర్థులపై డేగ కన్ను

ప్రత్యర్థి పార్టీ నాయకుల కదలికలను గమనిస్తూ వారి కోటలను బద్దలు కొట్టి తమ పార్టీ జెండాను ఎగురవేసే దిశగా ద్వితీయ శ్రేణి నేతలు పావులు కదుపుతుంటారు. పార్టీ బలాన్ని పెంచడంతో పాటుగా ఎదుటి పార్టీలో అలకబూనిన నేతలను, అసంతృప్తి నేతలను గుర్తించి తమ వైపు తిప్పుకునేందుకు యత్నిస్తున్నారు. ఓటర్లను ఆకట్టుకునేలా మాట్లాడటం, ప్రచారాలను నిర్వహించడం, పోలింగ్‌ రోజు ఓటు వేయించి ఎన్నికల్లో ఆధిపత్యం కొనసాగించేందుకు ద్వితీయ శ్రేణి నేతలు శ్రమిస్తున్నారు.

గెలుపోటముల్లో కీలక పాత్ర

ఎన్నికల బరిలో నిలబడే అభ్యర్థుల గెలుపోటముల్లో రెండవ శ్రేణి నేతలదే కీలక పాత్ర. ఎన్నికల నేపథ్యంలో ప్రతి చోట నాయకులు పార్టీలు మారడం, కొత్త వారు చేర్పడంలో అభ్యర్థుల ప్రధాన అనుచరులు కీలక పాత్ర పోషిస్తుంటారు. ఎన్నికల్లో గెలుపోటములు ప్రధానంగా ద్వితీయ శ్రేణి నేతలపై ఆధారపడి ఉంటుంది. అభ్యర్థి ఎన్నికల్లో గెలిచి ఐదేళ్లు పాలించాలంటే ఈ నేతలే కీలకంగా మారుతున్నారు.

అధికారం ఇస్తే మరింత అభివృద్ధి



ప్రచారంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌

ఆమనగల్లు: అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపించాలని ఆ పార్టీ కల్వకుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి జైపాల్‌యాదవ్‌ ఆకాంక్షించారు. కేసీఆర్‌ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. సోమవారం ఆయన రాష్ట్ర ఫుడ్‌ కమిషన్‌ చైర్మన్‌ గోలి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పట్టణంలోని పలు కాలనీలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్‌ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. విపక్షాలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగాలంటే మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనిచేశానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ తోట గిరియాదవ్‌, బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు పత్యానాయక్‌, నాయకులు సయ్యద్‌ ఖలీల్‌, సత్యం, రఘు, సాయిలు, వెంకటేశ్‌, భాస్కర్‌, రమేశ్‌, జహంగీర్‌, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ ఇంటింటి ప్రచారం

శంషాబాద్‌ రూరల్‌: మండలంలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గ అభ్యర్థి కె.నరేందర్‌ ప్రచారం ప్రారంభించారు. సోమవారం పెద్దతూప్రతండా, ముచ్చింతల్‌, పెద్దతూప్ర, గచ్చుబాయితండా, పాతతండా, ఇనాంషేరి, మేకలబండ తండా, మదన్‌పల్లి, పాల్మాకుల, పిల్లోనిగూడ, అలీకోల్‌తండా, ఎర్రకుంటతండా, జూకల్‌, పెద్దషాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ ప్రభుత్వంలోనే గిరిజనులకు న్యాయం జరిగిందని, ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించాలని నరేందర్‌ కోరారు. కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే సేవాలాల్‌ మహారాజ్‌ ఆలయాలు నిర్మించుకుని ప్రతి ఏటా వేడుకలు ఘనంగా నిర్వహించుకుందామన్నారు. మదన్‌పల్లిలో బీఆర్‌ఎస్‌ నుంచి పలువురు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ మండల అధ్యక్షుడు శేఖర్‌, మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, సర్పంచులు హన్సీ, చంద్రశేఖర్‌, నాయకులు మహేందర్‌, రాములునాయక్‌, అశోక్‌ తదితరులున్నారు.

అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కృషి

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి



ప్రచారంలో మాట్లాడుతున్న మహేశ్‌రెడ్డి

పరిగి: అన్ని వర్గాల సంక్షేమానికి సీఎం కేసీఆర్‌ కృషి చేస్తున్నారని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని మాదారం, గడిసింగాపూర్‌ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి బీఆర్‌ఎస్‌ పార్టీకి ఓటు వేయాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... దేశానికి ఆదర్శంగా మన రాష్ట్ర పథకాలు అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. తెలంగాణ రాక ముందు ఎలా ఉండే ప్రస్తుతం ఎలా ఉందో ప్రజలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. మూడో సారి తెలంగాణలో బీఆర్‌ఎస్‌ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ సభ్యురాలు హరిప్రియ, పీఏసీఎస్‌ వైస్‌ చైర్మన్‌ భాస్కర్‌ తదితరులు పాల్గొన్నారు

తాండూరు నుంచే అధిక మెజార్టీ

- కాంగ్రెస్‌ నియోజకవర్గ అభ్యర్థి మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్‌: అసెంబ్లీ ఎన్నికల్లో తాండూరు మండలం నుంచి కాంగ్రెస్‌ పార్టీకి అధిక మెజారిటీ వస్తుందని ఆ పార్టీ అభ్యర్థి బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని సిరిగిరిపేట్‌ గ్రామంలో 200 మంది యువత హస్తం గూటికి చేరారు. ఈ సందర్భంగా బీఎంఆర్‌ వారికి కండువాలు కప్పి కాంగ్రెస్‌లోకి స్వాగతించారు. యువత బీఆర్‌ఎస్‌ పాలనలో విసిగి కాంగ్రెస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. తనను గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతానన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్‌ చైర్మన్‌ రవిగౌడ్‌, మార్కెట్‌ కమిటీ మాజీ చైర్మన్‌ వడ్డె శ్రీను, నాయకులు వెంకటప్ప, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు కోట్‌పల్లి సర్పంచ్‌ రాజీనామా

బంట్వారం: ఎన్నికల వేళ నేతలు పార్టీలు మారుతూ సొంత పార్టీకి షాక్‌ ఇస్తున్నారు. కోట్‌పల్లి సర్పంచ్‌ విజయలక్ష్మి ఆదివారం కారు దిగి కాంగ్రెస్‌ గూటికి చేరారు. ఆమె అనుచరులతో మండల కేంద్రంలో భారీ ర్యాలీగా తరలివెళ్లి ఆమె కాంగ్రెస్‌ తాండూరు అభ్యర్థి మనోహర్‌రెడ్డి సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన కండువాకప్పి పార్టీలోకి స్వాగతించారు. అంనతరం వారిద్దరూ కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దేముల్‌ జెడ్పీటీసీ సభ్యుడు ధారాసింగ్‌ , మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు నక్కల బందెయ్య, కాంగ్రెస్‌ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్‌ నాయక్‌, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అంజయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్‌ శివానందం, మాజీ సర్పంచ్‌ జ్ఞానేశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.



బంట్వారం: సర్పంచ్‌ విజయలక్ష్మిని కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న మనోహర్‌రెడ్డి

అభివృద్ధికే ఓటేయండి



చేవెళ్ల: కమ్మెటలో ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రచారం

బీఆర్‌ఎస్‌ చేవెళ్ల అభ్యర్థి కాలె యాదయ్య

చేవెళ్ల: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే నాయకులు కావాలా.. ఆగమాగం చేసే నేతలు కావాలో ప్రజలే ఆలోచన చేసుకోవాలని బీఆర్‌ఎస్‌ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని ఈర్లపల్లి, ఎన్కేపల్లి, గొల్లగూడ, కమ్మెట, చనువెళ్లి, ఇక్కారెడ్డిగూడ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత గ్రామాలు ఎలా అభివృద్ధి చెందాయో ప్రజలు ఆలోచన చేయాలన్నారు. స్వాతంత్ర్యం నాటి నుంచి పాలన సాగించిన ప్రభుత్వాలు ఎందుకు చేయలేకపోయాయన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు చేస్తున్న సీఎం కేసీఆర్‌ను మరోసారి గెలిపించుకుంటేనే మనం మరింత వృద్ధి సాధిస్తామన్నారు. బీఆర్‌ఎస్‌ అధికారంలోకి రావాలంటే తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తులసీరాజు, రాంచంద్రయ్య, లక్ష్మీప్రభాకర్‌, మాజీ సర్పంచులు హన్మంత్‌రెడ్డి, రాంచంద్రయ్య నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, విక్రమ్‌, రాజేందర్‌, అంజన్‌, మాదవ్‌గౌడ్‌, సురేందర్‌, ముకుందం, శివానందం, రమేశ్‌రెడ్డి, ఎంపీపీ విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు మాలతి, బాల్‌రాజ్‌, రమణారెడ్డి, కృష్ణారెడ్డి, శివప్రసాద్‌, చంద్రశేఖర్‌, మోహన్‌రెడ్డి, మల్లారెడ్డి, రవీందర్‌రెడ్డి, శివారెడ్డి, రాము తదితరులు ఉన్నారు.

4వేల ఓట్లతో ఎన్టీఆర్‌ ఓటమి



ఆమనగల్లు: టీడీపీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్‌ కల్వకుర్తి నుంచి ఓటమిని చవిచూశారు. తెలుగుజాతి ఆత్మాభిమానం చాటేందుకు తెలుగుదేశం పార్టీనికి స్థాపించిన వెంటనే అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్‌ ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. 1989లో నిర్వహించిన ఎన్నికల్లో మాత్రం ఆయనకు కల్వకుర్తి చేదు అనుభవం మిగిల్చింది. ఆ ఎన్నికల్లో ఆయన హిందూపురంతో పాటుగా కల్వకుర్తిలో పోటీ చేశారు. హిందూపురంలో గెలిచిన ఆయన కాంగ్రెస్‌ కల్వకుర్తి అభ్యర్థి జె.చిత్తరంజన్‌ దాస్‌ చేతిలో నాలుగు వేల ఓట్లతో పరాజయం చెందారు. ఆయన ఓటమి జాతీయ స్థాయిలో రాజకీయ చర్చకు తెరతీసింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం చిత్తరంజన్‌దాస్‌కు మంత్రి పదవి కట్టబెట్టింది.

హస్తంకు ఓటేస్తే ‘ఆరు గ్యారంటీ’లు



బాకారంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న కాంగ్రెస్‌ అభ్యర్థి భీం భరత్‌

చేవెళ్ల కాంగ్రెస్‌ అభ్యర్థి పామెన భీంభరత్‌

మొయినాబాద్‌/మొయినాబాద్‌ రూరల్‌: కాంగ్రెస్‌ను గెలిపిస్తే ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తామని చేవెళ్ల కాంగ్రెస్‌ అభ్యర్థి పామెన భీంభరత్‌ అన్నారు. సోమవారం ఆయన మండల పరిధిలోని నాగిరెడ్డిగూడ, అప్పోజీగూడ అజీజ్‌నగర్‌, బాకారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పదేళ్లలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్‌ బెడ్‌రూం ఇళ్లు ఇస్తామని చెప్పి ఇప్పటికీ ఒక్కరికి కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్‌ భూములను గుంజుకుని పెద్ద కంపెనీలకు అమ్ముకుంటున్నారని విమర్శించారు. దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు పథకాలు బీఆర్‌ఎస్‌ కార్యకర్తలకే ఇచ్చారన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసం చేస్తున్న బీఆర్‌ఎస్‌ను ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని.. అదీ కాంగ్రెస్‌ వైపే చూస్తున్నారన్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. టీపీసీసీ సభ్యుడు షాబాద్‌ దర్శన్‌, అధికార ప్రతినిధి సతీశ్‌, సీనియర్‌ నాయకులు వసంతం, సంజీవరెడ్డి, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మహేందర్‌ ముదిరాజ్‌, యూత్‌ కాంగ్రెస్‌ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు ఎలిగేపల్లి శ్రీనివాస్‌ యాదవ్‌, పార్టీ మండల అధ్యక్షుడు మాణయ్య, ఎంపీటీసీ సభ్యుడు రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు సద్గుణాచారి, సత్యనారాయణ, పురాణం వీరభద్రస్వామి, ఎంపీటీసీ మాజీ సభ్యులు కొమ్మిడి వెంకట్‌రెడ్డి, యాదయ్య, కాంతారావు, నాయకులు మాణిక్యం, రాజు, శ్రీనివాస్‌యాదవ్‌, సంజీవ, అశోక్‌, నర్సింహ, కేబుల్‌ రాజు తదితరులు పాల్గొన్నారు.